సాక్షి చిత్తూరు

శనివారం । 31 । ఆగస్టు । 2024



మృత్యువును తప్పించుకుని..

చిత్తూరు నగరంలో ప్రైవేటు బస్సు సృష్టించిన బీభత్సంలో ఐదుగురు మృత్యువు నుంచి తప్పించుకుని బయటపడ్డారు.

- 8లో



ఐదుగురు స్మగ్లర్ల అరెస్టు

పూతలపట్టు, వడమాలపేట మండలాల్లో ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేశారు.

- 8లో



రోడ్డుపై మృతదేహంతో ధర్నా

న్యాయం చేసేవరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదంటూ చిన్నవెంకటంపల్లె దళితులు రోడ్డుపై ధర్నా చేశారు

- 8లో

న్యూస్‌రీల్

జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా ఎం.ఎం.నాయక్



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించేందుకు ఐఏఎస్ కేడర్ కలిగిన ఎం.ఎం.నాయక్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం జీవో 1495ను జారీచేసింది. రాష్ట్రస్థాయిలో పశుసంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న ఎం.ఎం.నాయక్‌ను జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. 2005 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన విజయనగరం కలెక్టర్‌గా, పలు కేడర్లలో విధులు నిర్వహించారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అభినందించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత క్రీడాకారులకు జ్ఞాపికలను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ క్రీడల్లో చిత్తూరు జిల్లా క్రీడాకారులు రాణించడం గర్వకారణమన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన బాస్కెట్‌బాల్, ఖోఖో, ఫెన్సింగ్ క్రీడల్లో రాణించిన గురుచరణ్, రాజ్‌కుమార్, బద్రినాథ్, అన్పునిషా, తులసిరామ్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎస్‌డీఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

5న పాలిటెక్నిక్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

పుంగనూరు: ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విద్యాలయం పరిధిలోని పుంగనూరు పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సులకు సెప్టెంబర్ 5న గుంటూరులో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.మంజుల తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు, దరఖాస్తు చేయని విద్యార్థులకు కూడ స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. గుంటూరులోని కృష్ణా ఆడిటోరియం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పదో తరగతి పాస్, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు వారి మార్కుల అర్హతను బట్టి అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను గానీ, 90104 02068, 94932 53151, 94914 59956ను సంప్రదించాలని కోరారు.

రెండు యార్డుల్లో ఇసుక నిల్వ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రెండు యార్డుల్లో ఇసుక నిల్వ ఉందని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు మండలంలోని పాలూరు, దిగువమాసాపల్లెలోని రెండు యార్డుల్లో ఇసుక పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ రెండు స్టాక్ యార్డుల్లో ఇసుక ఒక టన్ను రూ.155గా నిర్ధారించినట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీ నాటికి పాలూరు స్టాక్ యార్డులో 31,825 టన్నులు, దిగువమాసాపల్లెలో 33,025 టన్నుల ఇసుకను సరఫరా చేశారన్నారు. ప్రస్తుతం పాలూరు స్టాక్ యార్డులో 10,202 టన్నులు, దిగువమాసాపల్లిలో 1,06,185 టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు తెలిపారు. ఇసుక అధిక ధరలకు విక్రయిస్తే www. chittoorsand75 @gmail. com కు కానీ, 08572-299509కు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ వెల్లడించారు.

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సెప్టెంబర్‌లో ఇవ్వాల్సిన సామాజిక పింఛన్లను ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేస్తారన్నారు. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి అందజేస్తారని తెలిపారు. జిల్లాలో సెప్టెంబర్ నెలకుగాను 2,70,543 మంది లబ్ధిదారులకు రూ.114.12 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 6గంటల నుంచి పింఛన్ పంపిణీ ప్రారంభించాలని ఆదేశించినట్లు చెప్పారు. జిల్లాలో ఏదైనా కారణాలతో 31వ తేదీ పింఛన్లు పొందకపోతే సెప్టెంబర్ 2న పంపిణీ చేస్తారన్న విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని తెలిపారు.

జిల్లాకు జ్వరం

విషజ్వరాలు జిల్లాను చుట్టేశాయి. పల్లె పట్నం అనే తేడా లేకుండా పంజా విసురుతున్నాయి. చలితోపాటు నొప్పులు బాధిస్తున్నాయి. సీజన్‌లో వచ్చే సాధారణ జ్వరాలకు ఇవి భిన్నంగా ఉన్నాయి. అంతుబట్టని ఈ విషజ్వరాలు జనాన్ని వణికిస్తున్నాయి. మరోవైపు డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇవి శారీరకంగానే కాకుండా, మానసికంగా జనాన్ని దెబ్బకొడుతున్నాయి. జ్వరపీడితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. మందుల దుకాణాల్లోనూ ఈ మందుల కొనుగోళ్లు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులు రక్తపరీక్షల పేరుతో వేలాది రూపాయలు గుంజుతున్నాయి.



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

- జిల్లా వ్యాప్తంగా విషజ్వరాల విజృంభణ
- పల్లె, పట్టణం తేడాలేకుండా జ్వరాలు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఈ ఏడాది జ్వరాల సీజన్ పూర్తి భిన్నంగా ఉంది. జిల్లాలో పలమనేరు, పెద్దపంజాణి, పుంగనూరు, వి.కోట, శాంతిపురం, చిత్తూరు అర్బన్, రూరల్, గంగాధరనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం, గుడిపాల, యాదమరి, తవణంపల్లి, బంగారుపాళ్యం, పెనుమూరు మండలాల్లో ఎక్కువ భాగం విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మరోవైపు టైఫాయిడ్, డెంగీ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎక్కడికక్కడ స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు తాత్కాలిక వైద్యం అందించినా జ్వరం, ఒంటినొప్పులు తగ్గకపోవడంతో వారే ప్రైవేటు వైద్యశాలలకు సిఫార్సు చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. వారం రోజుల్లో 3వేలకుపైగా ఓపీలురాగా ప్రతి రోజూ వంద మందికు పైగా మంచానపడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ సంఖ్య 200పైమాటే.

ఆర్‌ఎంపీల వద్దకే....

జిల్లాలో ఈ సీజన్‌లో విషజ్వరాలతో పాటు డెంగీ జ్వరాలు కూడా ఎక్కువగానే నమోదు అవుతున్నాయి. ఒక్కసారిగా తెల్ల రక్త కణాలు పడిపోతుండడంతో బాధితులు తీవ్ర అస్వస్థతకు లోనవుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీల వద్ద విషజ్వరాలు, డెంగీ కేసుల చికిత్సల కోసం బాధితులు బారులు తీరుతున్నారు. డెంగీ బాధితులకు చికిత్స చేసే ఆర్‌ఎంపీలు వారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా చేజారిన తర్వాత పెద్ద ఆస్పత్రికి, తమిళనాడులోని సీఎంసీకి తరలిస్తున్నారు. దీంతో వారి పరిస్థితి విషమంగా మారుతోంది.

దీర్ఘకాలిక రోగుల పరిస్థితి దారుణం

జ్వరం వస్తే షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు, వృద్ధులు కోలుకోవడం కష్టంగా ఉంది. జ్వరం వస్తే వారు పూర్తిగా బలహీన పడుతున్నారు. జ్వరం తగ్గినా కీళ్ల నొప్పులు, అరికాళ్లలో మంటలు, కాళ్లు, చేతులు వాపులతో అల్లాడిపోతున్నారు. పది, పదిహేను రోజులకు కూడా నీరసం తగ్గడం లేదని అంటున్నారు. నొప్పులు తట్టుకునేందుకని వాడుతున్న మందుల కూడా వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.


జ్వరానికి ఫీజులు ఇలా...

ఫీజులు రూ.50 నుంచి రూ.100 వరకు తీసుకోవడంతో పల్లె ప్రాంతాల్లోని అధిక శాతం ప్రజలు ఆర్‌ఎంపీల వద్దకు క్యూకడుతున్నారు. వాళ్ల దగ్గరకు వెళితే వెంటనే తగ్గిపోతుందని భావించి ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. మాత్రలకు వీరి వద్ద రూ. 200 నుంచి రూ.300వరకు ఖర్చువుతోంది. అదే ప్రైవేటు క్లినిక్‌లకు వెళితే రూ. 150 నుంచి రూ.200వరకు ఫీజు వసూళ్లు చేస్తున్నారు. మందులు, మాత్రలకు కలిపి రూ. 300 నుంచి రూ.500 వరకు ఖర్చవుతోంది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు వెళితే ఫీజు రూ.300 నుంచి రూ.400 వరకు ఉంటోంది. అక్కడ మాత్రలు, మందులు తీసుకోవాలంటే రూ. 1000 దాటుతోంది. ఇక సెలైన్ బాటిల్ కూడా పెట్టిస్తున్నారు. ఇందుకు గాను మరో రూ.500వరకు వసూలు చేస్తున్నారు.

వీడని నొప్పులు

జిల్లా జ్వరంతో అల్లాడిపోతోంది. గతంలో ఎన్నడూ లేనట్లుగా ప్రస్తుతం వస్తున్న జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా తీవ్ర జ్వరం, దగ్గు తలనొప్పి, గొంతునొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. కొందరిలో రోజుల తరబడి 102 డిగ్రీలపైన జ్వరంతో పాటు తలనొప్పి ఒళ్లు నొప్పులు కనిపిస్తున్నాయి. విపరీతమైన ఎండ, వేడిమి, ఉక్కపోత...అంతలోనే వర్షాలు వంటి అసమతుల్య వాతావరణంలో జ్వరాలు వ్యాపిస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలం మొదలైన తర్వాత సీజనల్‌గా జ్వరాలు వస్తూ ఉంటాయి. అయితే కొత్తగా వస్తున్న జ్వరాలు మానసికంగా, శారీరకంగా కోలుకోలేని దెబ్బ కొడుతున్నాయి. ఇవి వైరల్ ఫీవర్లు కావడంతో ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడితే.. ఇంటిల్లిపాదీ వీటికి గురవుతున్నారు. బాధితుల్లో జ్వరం, కీళ్ల నొప్పులు, పాదాలు, చేతుల వాపు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. జ్వరం తగ్గుతున్నా, కొంత కాలం వరకు కీళ్ల నొప్పులు పలువురిని వదలటం లేదు. మెజార్టీ రోగుల్లో 4-6 వారాల పాటు కీళ్ల నొప్పులు వేధిస్తున్నట్లు చెబుతున్నారు.

- జీడీనెల్లూరు మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన కవిత(36) రెండు రోజుల పాటు తీవ్ర జ్వరంతో బాధపడింది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు గురువారం రాత్రి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. కొన్ని గంటల వ్యవధిలోనే మరణించింది. అయితే డాక్టర్లు ఊపిరితిత్తుల సమస్య కారణంగా చనిపోయినట్లు ప్రకటించారు.
- పెనుమూరు మండలం పులికల్లు గ్రామాన్ని జ్వరం కుదిపేసింది. చిన్న పెద్ద తేడా లేకుండా జ్వరం బారిన పడ్డారు. జ్వరంతో పాటు జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు పట్టి పీడించాయి. బాధితులంతా తక్షణం ఆస్పత్రికి వెళ్లి మందు బిళ్లలు, ఇంజెక్షన్ తీసుకోవడంతో జ్వరం కుదుటపడుతోంది. అయితే ఓ శుభాకార్యానికి వెళ్లి ఇలా జ్వరం వ్యాపించిందని, ప్రస్తుతం కోలుకుంటామని బాధితులు పేర్కొన్నారు.



రోజు వారీగా ఓపీ వివరాలు

తేది	పీహెచ్‌సీ /యూపీహెచ్‌సీలు	జిల్లా/ఏరియా /సీహెచ్‌సీలు
ఆగస్టు 21	110	211
ఆగస్టు 22	115	192
ఆగస్టు 23	125	215
ఆగస్టు 24	121	220
ఆగస్టు 25	45	125
ఆగస్టు 26	95	134
ఆగస్టు 27	145	251

ఈనెల 21 నుంచి 27వరకు నమోదైన జ్వరాలు

	0-5 పిల్లలు		5 ఏళ్లకు పైబడినవారు	
	ఓపీ	ఐపీ	ఓపీ	ఐపీ
జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి	39	4	246	6
ఏరియా	129	22	695	72
సీహెచ్‌సీ	40	8	560	134

“

నొప్పులు భరించలేక..



తెల్లవారే వరకు బాగానే ఉంది. ఆపై కాస్త చలిగా, మెల్లగా తలనొప్పి మొదలైంది. నొప్పులు కూడా మొదలయ్యాయి. మా ఊళ్లో కూడా చాలా మందికి ఇలానే ఉన్నాయి. ఆస్పత్రికి వచ్చి చూపించుకున్నా. మందులు ఇచ్చారు. తగ్గకపోతే మళ్లీ రమ్మన్నారు.

–ధనంజయ్య, పెనుమూరు

జాగ్రత్తగా ఉండాలి



జ్వరం వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటినే తాగాలి. మాంసాహారాలకు దూరంగా ఉండాలి. మితాహారం తినాలి. పరిసరాల శుభ్రత పాటించాలి. ప్రభుత్వ వైద్యులు, గుర్తింపు పొందిన డాక్టర్ వద్దే చికిత్స తీసుకోవాలి. విచ్చలవిడిగా మందుల వాడకం మంచిది కాదు.

– ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

దోమలతో జాగ్రత్త



జ్వరాల వ్యాప్తిపై ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరమే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. సాధారణంగా 4 లక్షల ప్లేట్‌లెట్స్ కౌంట్ ఉండాలి. 2.5 లక్షల కంటే తగ్గకూడదు. 50వేలకు పడిపోతే వైద్యులను సంప్రదించాలి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జ్వరం లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–రాజశేఖర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్, చిత్తూరు

నిఘా, పర్యవేక్షణ కమిటీకి దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ నూతన సభ్యుల నియామకానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పౌరహక్కుల చట్టం 1955, అత్యాచార నిరోధక చట్టం 1989 అమలుకు నిఘా, పర్యవేక్షణ కమిటీని నియమించనున్నట్లు చెప్పారు. ఈ కమిటీలో 5 మంది ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన (నాన్ అఫిషియల్స్), 3 ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల నిర్వహించే ఎస్సీ,ఎస్టీ లు, మిగిలిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

దరఖాస్తుకు అర్హతలు ఇలా....

- షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన ఆయా కులాల అభ్యున్నతికి సామాజిక సేవా దృక్పథం కలిగిన వారై ఉండాలన్నారు.
- ఒక వ్యక్తి జీవిత కాలంలో రెండు పర్యాయములు మాత్రమే జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యునిగా ఉండేందుకు అర్హులు.
- షెడ్యూల్డ్ కులాలు, తెగల పౌరహక్కుల చట్టం, అత్యాచార నిరోధక చట్టంలో విశిష్ట అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.
- ఇది వరకు చేపట్టిన సాంఘిక సేవా కార్యక్రమ వివరాలను తగిన ఆధారాలతో, పూర్తి బయోడేటాతో కలెక్టరేట్‌లోని అంబేద్కర్ భవనంలో ఉండే ఎస్సీ వెల్ఫేర్ శాఖలో సెప్టెంబర్ 9వ తేదీలోపు అందజేయాలని కలెక్టర్ వెల్లడించారు.

నేటి నుంచి రాజనాలబండ తిరుణాల

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద నేటి నుంచి రెండు రోజుల పాటు వైభవంగా తిరుణాల నిర్వహించనున్నారు. టీటీడీ పరిధిలోకి ఈ ఆలయం చేరిన తరువాత తొలిసారిగా ఈ తిరుణాల జరగనుంది. ఏటా పూర్వీకుల నుంచి శ్రావణమాస చివరి శనివారం రోజున రాజనాల బండపై వెలసిన స్వామివారికి ప్రత్యేక పూజలు, పక్కనే ఉన్న ఎత్తయిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి కొండపై పూజలు చేయడం ఆనవాయితీ. అదే రోజు రాత్రి కొండపై గల రాతి స్తంభంపై దీపం వెలిగించి అఖండ దీపారాధన చేస్తారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో మేళతాళాల నడుమ ఊరేగించనున్నారు. ఆదివారం రోజున కోలాహలంగా తిరుణాల నిర్వహించనుంది. రాజనాలబండకు సమీపంలోని మొత్తం 18 గ్రామాలకు చెందిన ప్రజలు ఈపండుగను జరుపుకుంటారు.

ఆలయం వద్దకు దేవరెద్దులు

కొత్తగూబలవారిపల్లె వద్ద దాసరయ్యగారిపల్లె, పెద్దూరు, ఉటూరు గ్రామాలకు చెందిన దేవరెద్దులను గ్రామపెద్దలు మేళతాళాల నడుమ రాజనాలబండవద్దకు తీసుకొస్తారు. కొలింపల్లె నుంచి గ్రామదేవత బోయకొండ గంగమ్మ ఉత్సవ మూర్తితో కలసి ఊరేగింపుగా చేరుకుంటారు. అనంతరం దేవరెద్దులు, బోయకొండ అమ్మవారిని రాజనాలబండ చేర్చి, ఉట్లోత్సవం, పోకుమాను బరుగుట వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. టీటీడీ ఏఈఓ మునికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయం ముందు షామియానాలు, విద్యుత్ దీపాలు, ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు.



ఉట్లోత్సవం నిర్వహణకు చేసిన ఏర్పాట్లు



రాజనాలబండ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఏ టికెట్లూ లేకుండా దర్శనానికి వెళ్లే వారికి 18 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ టీబీసీ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 65,529 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,730 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారి హుండీకి కానుకల రూపంలో రూ.4.51 కోట్లు లభించింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించారని తెలియజేస్తోంది.

క్లుప్తంగా

రేషన్ తూకం యంత్రం పరిశీలన



తూకపు యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

పూతలపట్టు: మండల పరిధిలోని రేషన్‌షాపులో ఉన్న తూనిక యంత్రాన్ని తూనికలు– కొలతల శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బరువు యంత్రాల్లోని మార్పులు చేర్పులను సరిచూశారు. ఈ పనితీరులో లైసెన్స్‌లేని బయటి వ్యక్తిని అధికారులు యంత్రాన్ని పరిశీలించడానికి తీసుకొచ్చినట్లు విలేకర్లకు సమాచారం అందింది. దీంతో పాత్రికేయులు స్థలానికి చేరుకోగానే విషయం తెలుసుకున్న ఆ వ్యక్తి పరారయ్యారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్‌ని పాత్రికేయులు ప్రశ్నించగా ఏమీ తెలియనట్టు సమాధానం ఇచ్చారు.

విద్యార్థులకు కాలం చెల్లిన బిస్కెట్ల పంపిణీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో శుక్రవారం జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు కాలం చెల్లిన బిస్కెట్ ప్యాకెట్లను అందచేయడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పట్టింది. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో చిత్తూరులోని రిజర్వు ఫారెస్టులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. దీనికి నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన పిల్లల్ని తీసుకొచ్చారు. కార్యక్రమం ముగిసిన తరువాత విద్యార్థులకు నిర్వాహకులు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అయితే బిస్కెట్ ప్యాకెట్ ఈ ఏడాది జూన్ నెలకే కాలం తీరిపోయినట్టు ఓ విద్యార్థిని గుర్తించింది, తన స్నేహితులకు చెప్పింది. అప్పటికే కొందరు బిస్కెట్లు తినేయగా, మరికొందరు బిస్కెట్ ప్యాకెట్లపై ఉన్న కాలం చెల్లిన తేదీని గుర్తించి వాటిని పడేశారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగలేదు. పిల్లలకు ఇచ్చే తినుబండారాలపై ఎక్స్‌పైరీ తేదీ చూడకుండా నిర్వాహకులు వీటిని పంపిణీ చేయడం విమర్శలకు దారితీసింది. జరగరాని ప్రమాదం జరిగి ఉంటే బాధ్యత ఎవరు వహిస్తారో అటవీశాఖ అధికారులే చెప్పాలి.

మృత్యువును తప్పించుకుని..

- ప్రాణాలతో బయటపడ్డ ఐదుగురు
- ఆటో అడ్డు నిలబడకుంటే పెద్ద ప్రాణనష్టం
- చిత్తూరులో బస్సు బీభత్సం



ఘటనా స్థలంలో మృతి చెందిన గణపతి (ఇన్‌సెట్‌లో ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని గిరింపేట కూడలి. శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలు వేలూరు నుంచి చిత్తూరు వైపు ప్రయాణికులతో వస్తున్న ఓ ప్రైవేటు బస్సు గిరింపేట కూడలిలో ఆపి, ప్రయాణికులను కిందకు దించాల్సింది. కానీ బస్సు ఆగలేదు. నెమ్మదిగా ముందుకు వస్తున్న బస్సు తొ లుత ద్విచక్ర వాహనంపై చిత్తూరు వైపు వెళుతున్న నవీన్, వెనుక కూర్చున్న అతని పెద్దమ్మ వాణిశ్రీను ఢీకొట్టింది. ద్విచక్రవాహనాన్ని పూర్తిగా కుడివైపు తిప్పిన నవీన్, వాణిశ్రీ అదృష్టవశాత్తు అవతలివైపు పడిపోయారు. కానీ ఇద్దరికీ కాళ్లు, చేతులు విరిగినా ప్రాణాలతో బయటపడ్డారు. ఓ పెళ్లికి వెళ్లి వస్తుండగా ప్రమాదానికి గురైనట్లు నవీన్ తెలిపాడు. ఇంకొద్దిగా ముందుకు వెళ్లిన బస్సు మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. వాహనం నడుపుతున్న గుడిపాల మండలం చుక్కావారిపల్లెకు చెందిన ప్రేమ్‌నాథ్ రోడ్డుకు ఎడమవైపు పడిపోగా, అతని మామ జి.గణపతి (58) రోడ్డుకు కుడివైపు పడడంతో ఒక్కసారిగా బస్సు ముందరి చక్రం అతని తల పై ఎక్కేయడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బ్యాంకులో రుణం ఎంత ఉందో తెలుసుకోవడానికి చిత్తూరుకు వస్తున్న తన అక్క భర్తను మృత్యువు ఇలా కబళించిందని ప్రేమ్‌నాథ్ బోరున విలపించాడు. బస్సు మరికొద్ది దూరం ముందుకు వెళ్లి కలెక్టరేట్‌వైపు వెళుతున్న ఆటోను ఢీకొట్టి దాదాపు వంద మీటర్లకు లాక్కుంటూ వెళ్లింది. ఆటోలో కూర్చున్న డ్రైవర్ షణ్ముగం ఆయువు గట్టిది కావడంతో అలాగే కూర్చుండిపోయి కొద్ది దూరం వెళ్లాక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కిందకు దూకేయడంతో ఇతని ఎడమచేయి విరిగిపోయింది. ఆటోను ఈడ్చుకుంటూ వెళ్లిన బస్సు గిరింపేట వెన్నెల టీ స్టాల్ వద్ద ఆగింది. ఆటోను ఈడ్చుకుంటూ వెళ్లే సమయంలో ఓ కారును తాకుతూ వెళ్లడంతో కారులో ఉన్న వ్యక్తి తప్పించుకున్నాడు. అన్నం తినడానికి ఇంటికి వెళుతున్న సమయంలో బస్సు తన ఆటోను ఢీకొందని డ్రైవర్ షణ్ముగం తెలిపాడు.

ఆటో అడ్డుపడకుంటే..

ఈ ప్రమాదంలో చుక్కావారిపల్లెకు చెందిన ప్రేమ్‌నాథన్, బంగారుపాళ్యంకు చెందిన నవీన్, అంబేడ్కర్ నగర్‌కు చెందిన అతని పెద్దమ్మ వాణిశ్రీ, గిరింపేటకు చెందిన ఆటో డ్రైవర్ షణ్ముగం అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. లేకుంటే బస్సు సృష్టించిన బీభత్సానికి ఎన్ని ప్రాణాలు పోయి ఉండేవో ఊహించలేమని, ప్రమాదం నుంచి బయటపడ్డవాళ్లు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆటో డ్రైవర్ షణ్ముగను విచారిస్తున్న ట్రాఫిక్ సీఐ నిత్యబాబు

రెప్పపాటు కాలంలో జరిగిపోయిన ఈ ఘటనను చూస్తున్న స్థానికులు ఆగ్రహంతో రగిలిపోతూ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. డ్రైవర్ అప్పటికే పారిపోగా, పోలీసులు అతడ్ని పట్టుకున్నారు. 15 ఏళ్లకు పైగా భారీ వాహనాలు నడుపే అనుభవం ఉన్న డ్రైవర్ తమిళనాడుకు చెందిన మురుగన్‌గా గుర్తించారు. బ్రేకులు తొక్కుతున్నా పడకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు డ్రైవర్ పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకం

చౌడేపల్లి: మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధిచేసి అమ్మవారి గర్భాలయానికి అరటి చెట్లతోపాటు, మామిడి, వేపాకు, పూలతోరణాలతో సుందరంగా ముస్తాబుచేశారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో రాహుకాల సమయంలో అభిషేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చిన అమ్మవారికి పూజలు చేయించారు. చివరి శ్రావణ మాసపు శుక్రవారం కావడంతో మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఊహించని రీతిలో ఆలయంలో అభిషేక పూజలకు రద్దీ నెలకొంది. ఉభయదారులకు ఈఓ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆలయం వద్ద ఉచిత అన్నప్రసాదం

బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద భక్తులకు సౌకర్యంగా ఏర్పాటు చేసిన ఉచిత అన్న ప్రసాద కేంద్రం వద్ద శుక్రవారం అన్నప్రసాదం వితరణ చేశారు. ఈఓ పర్యవేక్షణలో సుమారు వెయ్యిమందికి అన్నప్రసాదం ఏర్పాటు చేసి వారే వడ్డించారు. పలమనేరుకు చెందిన నవీన్‌కుమార్ కూరగాయలను వితరణగా అందజేశారు.



బోయకొండలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఐదుగురు స్మగ్లర్ల అరెస్ట్



పట్టుబడిన స్మగ్లర్లు, ఎర్రచందనం దుంగలు, వాహనాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- 28 ఎర్రచందనం దుంగలు, మూడు వాహనాలు స్వాధీనం

తిరుపతి మంగళం : వడమాలపేట, పూతలపట్టు పరిసరాల్లో 28 ఎర్రచందనం దుంగలు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని, ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్‌చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు గురువారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన బృందాలు కూంబింగ్ చేపట్టాయి. ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ బృందం పుత్తూరు సెక్షన్‌లోని వడమాలపేట అటవీ ప్రాంతంలో జరిగిన కూంబింగ్‌లో గురువారం 26 ఎర్రచందనం దుంగలు, ఒక ట్రక్, మరో కారు స్వాధీనం చేసుకుంది. స్మగ్లర్లను చుట్టిముట్టే ప్రయత్నంలో నలుగురు పట్టుబడగా, మిగిలిన వారు తప్పించుకున్నారు. అరెస్టయిన వారిలో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ముగ్గురు, తిరువళ్లూరు జిల్లాకు చెందిన ఒకరు ఉన్నారు. ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం చిత్తూరు–కడప హైవేలో కూంబింగ్ చేపట్టగా పూతలపట్టు సమీపంలోని రంగంపేట వద్ద రెండు ఎర్రచందనం దుంగలను కారులో తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. వారిని చుట్టుముట్టగా ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. మిగిలిన వారు పారిపోయారు. కారుతో పాటు రెండు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి అన్నమయ్య జిల్లాకు చెందినవాడుగా గుర్తించారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. రెండు కేసులను టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌లో నమోదుచేసి ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో వ్యక్తిని హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ సాయినాథ్, సీఐ నెట్టికంఠయ్యతో కలిసి వివరాలను మీడియాకు వెల్లడించారు. బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లెకు చెందిన దినసరి కూలీ షేక్ దావూద్ బాషా మూడు రోజుల క్రితం చిత్తూరు నగరంలోని కల్పనా మద్యం బార్ వద్ద పడుకుని ఉన్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న చిత్తూరు తోటపాళ్యంకు చెందిన మణికంఠన్(33), కార్తిక్(28), వీళ్ల స్నేహితుడు ఖమ్మంకు చెందిన వేముల రాజు(28) దావూద్ బాషాను కొట్టి అతని జేబులో ఉన్న రూ.200 లాక్కుని మద్యం తాగారు. అప్పటికే మద్యం మత్తులో దావూద్‌బాషాను పొన్నియమ్మగుడివీధి, సుందరయ్యవీధి, రాములగుడివీధి, లక్ష్మీ థియేటర్, రాజు గుడి మీదుగా అందరూ చూస్తుండగానే కొట్టుకుంటూ వీరభద్రకాలనీలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. ఇంకా రూ.20 వేలు కావాలని దాడి చేయగా, మణికంఠ ఫోన్ నుంచి దావూద్ తన తమ్ముడు పూలన్‌బాషాకు ఫోన్‌చేసి రూ.20 వేలు అడిగాడు. ఇవ్వకుంటే చంపేస్తామని ఫోన్‌లో మణికంఠ అతని స్నేహితులు బెదిరించారు. మరుసటి రోజు డబ్బు సర్దుతామని చెప్పగా ఫోన్ కట్ చేశారు. అనంతరం అక్కడే ఉన్న రాళ్లతో దావూద్‌బాషాను కొట్టి చంపేసి పారిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సీఐ నెట్టికంఠయ్య సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. నిందితులకు రిమాండు విధించగా, వీళ్లను చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ చూపించిన సీఐతో పాటు ఎస్ఐ ప్రసాద్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



నిందితులను అరెస్టు చూపించి, వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయినాథ్

కుమార్తె ఆరోగ్యంపై బెంగ: తల్లి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ప్రేమళ

బంగారుపాళెం: అనారోగ్యంతో బాధపడుతున్న కుమార్తె ఆరోగ్యం నయం కాదేమోనని మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుందో తల్లి. ఈ సంఘటన మండలంలోని వెలుతురుచేను గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు, గ్రామానికి చెందిన జయకాంత్ భార్య ప్రేమళ, కుమార్తె దివ్యాంగురాలైన లిఖిత(03), కుమారుడు తనుష్(02) ఉన్నారు. జయకాంత్ కూలీ చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. లిఖితకు వైకల్యంతో బాధపడుతోంది. దీంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. బిడ్డ ఆరోగ్యంపై తల్లి ప్రేమళ బెంగతో ఉండేది. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన ప్రేమళ(21) ఇంట్లో మోల్డింగ్ కమ్మికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రేమళ మృతికి గల కారణాలను చుట్టుపక్కల వారిని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

చిత్తూరు అర్బన్: వచ్చే నెలలో వినాయకచవితి పండుగ నిర్వహించడానికి వీధుల్లో మండపాలు ఏర్పాటు చేసే వాళ్లు తప్పనిసరిగా నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకోవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నిమాపక, మునిసిపల్, పోలీసు, విద్యుత్ శాఖల నుంచి వేర్వేరుగా అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని, అన్ని శాఖలకు కలిపి www.ganeshutsav. net అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదుచేస్తే అనుమతి లభిస్తుందని వివరించారు. అలాగే ఫోన్–79950 95800కు వాట్సప్‌లో హాయ్ అని మెసేజ్ పంపితే, ఎన్‌వోసీకు కావాల్సిన సమాచారం అడుగుతుందని వెల్లడించారు. ఆపై అధికారుల బృందం మండపం ఏర్పాటుచేసే స్థలాన్ని పరిశీలించి అనుమతి ఇస్తారన్నారు. ఎన్‌వోసీ పత్రాన్ని ప్రతి మండపం వద్ద తప్పకుండా ప్రింట్ తీసి ఉంచాలని చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తవణంపల్లె: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెంది పొలంలో పడి ఉండగా గుర్తించినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు, మండలంలోని కాణిపాకం పట్నం సమీపంలోని హైవే బ్రిడ్జి పక్కన పైపల్లె రెడ్డెప్పరెడ్డికి చెందిన భూమిలో ముష్టి చెట్టు కింద సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన మహిళ మృతి చెంది పడి ఉండగా కనుగొన్నట్లు తెలిపారు. ఆరురోజుల క్రితం మహిళ మృతి చెందినట్లు తెలుస్తుందని చెప్పారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని వివరించారు. మృతురాలు మెరూన్ కలర్ చీర, జాకెట్ ధరించి ఉన్నదని పేర్కొన్నారు. రెండు కాళ్లకు పట్టీలు, మెట్లు కలిగి ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత మృతికి కారణాలు తెలుస్తాయని వివరించారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐని సంప్రదించాలని కోరారు.

రోడ్డుపై మృతదేహంతో ధర్నా



వైఎస్ గేటులో మృతదేహంతో రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఐరాల: రోడ్డు ప్రమాదంలో గురువారం రాత్రి మృతి చెందిన కె.మునిరత్నం కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తేనే మృతదేహాన్ని తీసుకెళతామంటూ చిన్నవెంకటంపల్లె దళితవాడ గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించారు. గ్రామస్తుల కథనం మేరకు, గురువారం రాత్రి కె.మునిరత్నం వై.ఎస్.గేటులో వారపు సంతకు వచ్చి తిరిగి స్వగ్రామానికి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్నాడు. ఐరాల మండలం పాతపాళ్యంకు చెందిన సురేంద్ర ద్విచక్రవాహనంపై చిత్తూరుకు వెళ్లి తిరిగి వస్తూ మునిరత్నంను వేగంగా ఢీకొనడంతో ఈ ఘటనలో మునిరత్నం దుర్మరణం చెందారన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులంతా కలిసి రోడ్డుపై మృతదేహంతో నిరసన వ్యక్తం చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులను శాంతింపజేసి శనివారం సాయంత్రంలోపు నిందుతుడిని అరెస్టు చేస్తామని, మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో దిగ్బంధనం విరమించి మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు.